ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 28.0



ఏలూరులో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ

దూరవిద్య యూజీ, పీజీ కోర్సులతో
అన్నివర్గాలకు విస్తృత విద్యా ప్రయోజనాలు

నూజివీడుకు బయోగ్యాస్ ప్లాంట్

రూ.150 కోట్ల పెట్టుబడి..
500 మందికి ఉపాధి అవకాశాలు

మంత్రివర్గ సమావేశంలో గ్రీన్‌సిగ్నల్..



ముంచెత్తిన వాన

లోపలి పేజీలో

మహా సందడి

తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మహానాడును ఘనంగా నిర్వహించే దిశగా పార్టీ అధినాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. మహానాడు నిర్వహణకు వివిధ కమిటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్లకు అవకాశం కల్పించారు. మొత్తం 17 కమిటీలకు 7 కమిటీల్లో జిల్లా నేతలున్నారు. మరోవైపు నియోజక వర్గాల వారీగా కార్యకర్తల్లో జోష్ పెంచేందుకు మినీ మహానాడు సభలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులన్నీ మహా సందడిలో ఉన్నాయి.

నియోజకవర్గాల్లో టీడీపీ మినీ మహానాడు

- మహానాడు కమిటీల్లో ఉమ్మడి జిల్లానేతలు
- మంత్రి నిమ్మల, తొమ్మిది మందికి చోటు
- మినీ మహానాడుకు పోటెత్తుతున్న కార్యకర్తలు
- ఆనంద డోలికల్లో ఎమ్మెల్యేలు, కన్వీనర్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెలాఖరున మహానాడు నిర్వహిస్తున్నారు. రాయలసీమ ప్రాంతం కడపలో మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేకించి తెలుగుదేశం ప్రభుత్వం తిరిగి అధికార పగ్గాలు చేపట్టిన తొలి ఏడాదిలో జరుగుతున్న మహానాడు కావడంతో ఏర్పాట్లు అట్టహాసంగా ఉండాలని భావిస్తున్నారు. కాస్తంత ఉత్సాహం, పట్టుదల ఉన్న నేతలను మహానాడు కమిటీల్లో నియమిస్తున్నారు.

7 కమిటీల్లో జిల్లా నేతలు

మహానాడుకు ప్రత్యేకంగా 17 కమిటీలు వేయగా, వీటిల్లోని ఏడు కమిటీల్లో ఉమ్మడి పశ్చిమ నేతలు, ఎమ్మెల్యేలనే నియమించారు. పార్టీ కార్యకర్తగా క్రమశిక్షణతో ఎదిగిన నిమ్మల రామానాయుడుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆహ్వాన కమిటీ, సభా ప్రాంగణం, పర్యవేక్షణ కమిటీల్లో ఆయనకు ప్రాతినిధ్యం కల్పించారు. పార్టీలో అత్యధిక ప్రాధాన్యత కలిగిన నేతల్లో మంత్రి నిమ్మల కూడా ఒకరు. భోజనాల ఏర్పాటు కమిటీలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు చోటు కల్పించారు. ప్రతీసారి పార్టీ కార్యక్రమాల్లో ఈ ఎమ్మెల్యేలిద్దరూ భోజన ఏర్పాట్లలో చురుకుగా వ్యవహరిస్తారు. తీర్మానాల కమిటీలో సీనియర్ నేత ఎంఏ షరీఫ్, ఫొటో ప్రదర్శన కమిటీలో మాజీ మంత్రి పీతల సుజాత, రవాణా కమిటీలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు అవకాశం ఇచ్చారు. పత్రిక, మీడియా కమిటీలో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పార్కింగ్ కమిటీలో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజును నియమించారు. ఇంతకముందు మహానాడు కమిటీల్లో ప్రత్యేకంగా సీనియర్లకు అవకాశం కల్పించేవారు. కానీ ఈ సారి సీనియర్ నేత, మాజీ ఎంపీ మాగంటి బాబుకు ఎక్కడా చోటివ్వకపోవడం చర్చనీయాంశమైంది. జిల్లాలో పలువురు సీనియర్లకు వివిధ కారణాలతో వారందరికి చోటివ్వలేకపోయారని చెబుతున్నారు.

నియోజకవర్గాల్లో ఉత్సాహం

మహానాడు నిర్వహణతో టీడీపీ శ్రేణుల్లో పట్టరాని ఆనందం కనిపిస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో మినీ మహానాడు సభలు నిర్వహించారు. ఏలూరు, చింతలపూడి, పోలవరం, ఉంగుటూరు, కైకలూరు, భీమవరం, ఉండి, ఆచంట, తాడేపల్లిగూడెం, గోపాలపురం నియోజకవర్గాల్లో మినీ మహానాడు సభలు ముగిశాయి. ప్రతీ నియోజకవర్గంలో మహిళలతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు ఉత్సాహంగా తరలివచ్చారు. గడిచిన ఐదేళ్ల పాటు తాము ఎదుర్కొన్న కష్టాల స్థానంలో సంతోషం పెరగడానికి పార్టీ గెలుపే కారణమని అనేక మంది మినీ మహానాడులో చెబుతున్నారు. కష్టమైనా, నష్టమైనా పార్టీకి వెన్నంటే ఉంటామని శపథం చేస్తున్నారు. ఇంతకుముందు నిర్ణీత సమయంలో మినీ మహానాడు నిర్వహించేవారు. ఈ సారి ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తుండగా పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావడంతో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ కన్వీనర్లు ఉప్పొంగిపోతున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో సైతం మినీ మహానాడు సభలు ధీటుగా జరుగుతున్నాయి. ఉంగుటూరు, తాడేపల్లిగూడెం నియోజవర్గాల్లో మినీ మహానాడు సూపర్ సక్సెస్ అయ్యింది. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు, నూజివీడులో మినీ మహానాడు నిర్వహించాల్సి ఉంది. చింతమనేని ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న దెందులూరులో బుధవారం నిర్వహించబోతున్నారు.



ఏలూరులో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గన్ని, చిత్రంలో ఎమ్మెల్యే చంటి



కైకలూరు మినీ మహానాడులో నియోజకవర్గ నేతలు



ద్వారకాతిరుమలలో జరిగిన గోపాలపురం నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

లోపలి పేజీలో



పాత పద్ధతిలో రేషన్

1 నుంచి చౌక డిపోల్లోనే సరుకులు

ఏలూరుసిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎండీయూ ఆపరేటర్ల విధానానికి స్వస్తి పలుకుతూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. జూన్ 1 నుంచి చౌక డిపోల్లోనే సరుకులు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో 1123 రేషన్ డిపోలున్నాయి. ప్రస్తుతం 395 ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరుకులు అందిస్తున్నారు. బియ్యం కార్డుదారులంతా రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిందే.

రేషన్ కార్డు దరఖాస్తుదారులకు కంట్రోల్ రూమ్

గ్రామ/వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డుల కోసం మే 7 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కార్డులో కొత్త సభ్యుల పేర్లు చేర్చడం, సభ్యుల పేర్లు విడదీయడం, కొత్త కార్డు మంజూరు, బియ్యం కార్డులో సభ్యుల పేర్లు తొలగింపు, బియ్యం కార్డును ప్రభుత్వానికి అప్పగించడం, అడ్రస్ మార్పు, ఆధార్ నంబరు సీడింగ్‌ను సరిచేసుకునే అవకాశం కల్పించారు. కంట్రోల్ రూమ్ నెంబరు 18004256453 కూడా ఏర్పాటు చేశారు. కార్డుదారులు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి పీఎస్ఆర్ మూర్తి మంగళవారం తెలిపారు.



ఉద్యోగులకు స్థానచలనం

ఉద్యోగుల్లో బదిలీల ఫీవర్ అలముకుంది. బదిలీలపై నిషేధాన్ని తాత్కాలికంగా సడలించడంతో ఉమ్మడి పశ్చిమలో ఎవరికివారు బదిలీ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మండల స్థాయిలో సిబ్బంది అత్యధికంగా బదిలీల వైపు మొగ్గుచూపుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుల కోసం ఇంకొందరు ప్రయత్నాలు ప్రారంభించారు. పోలీస్‌శాఖలో కిందస్థాయి బదిలీలు ఇప్పటికే దాదాపుగా పూర్తి కావచ్చాయి.

- బదిలీలపై నిషేధం సడలింపు
- ఒకేచోట రెండేళ్లు పనిచేస్తే బదిలీకి అర్హులే..
- ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తే బదిలీ తప్పనిసరి
- నేటి నుంచి.. 24లోగా దరఖాస్తు చేసుకోవాలి
- సిఫార్సుల కోసం నేతల వద్దకు పలువురు క్యూ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

బదిలీలపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చి నా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రాతిపదికన చేపట్టాల్సి ఉంది. బదిలీ విధి విధానాలు ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. ప్రత్యేకంగా రెండేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారు బదిలీకి అర్హులు. ఒకవేళ ఐదేళ్లు పైబడి ఒకే ప్రాంతంలో కొనసాగితే కచ్చితంగా బదిలీ చేస్తారు. ఉద్యోగ సంఘాల్లో ఆఫీస్ బేరర్‌కు 9 నుంచి 10 ఏళ్లకు ఒకేచోట పనిచేయడానికి ఈసారి వెసులుబాటు కల్పించారు. చాలా శాఖల్లో సిబ్బంది కొరత ఉండగా, మరికొన్ని శాఖల్లో సర్‌ప్లస్ కనిపిస్తోంది. కొన్నిశాఖల్లో నాలుగో తరగతి ఉద్యోగులు అవసరం కాగా, ఇంకొన్ని చోట్ల సంఖ్యకు మించి సిబ్బంది ఉన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పలు శాఖల్లో సిబ్బంది కొరత ఉంది. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడంతో రోజువారీ వ్యవహారాలకు ఉపయోగపడుతున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో చాలాచోట్ల సిబ్బంది కొరతే. మారుమూల మండలాల్లో కొరత స్పష్టంగా కనిపిస్తోంది. పట్టణాలకు అత్యంత దగ్గరగా ఉన్న మండలాల్లో మాత్రం పోటీ పడుతున్నారు. ఏలూరు జిల్లా కేంద్రం కార్యాలయానికి అత్యంత సమీపంలో ఉన్న ఐదు మండలాల్లోను ఈ తరహా పరిస్థితి ఉంది.

2వేల మందికిపైగానే..

ఈ సారి జరగబోతున్న సాధారణ బదిలీల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో 2వేల పైగానే ఉండవచ్చని భావిస్తున్నారు. కొన్నిచోట్ల రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం ఉండటంతో ఆ దిశగా కదులుతున్నారు. ఉపాధ్యాయ బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు

మిగతా 8వ పేజీలో

బదిలీలకు మార్గదర్శకాలు

- ఈనెల 31వ తేదీ నాటికి ఒకేచోట కచ్చితంగా ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగిని బదిలీ చేస్తారు.
- సొంత అభ్యర్థనపై బదిలీ కోరుకునే ఉద్యోగులు బదిలీలకు అర్హులు.
- పదవీ విరమణకు దగ్గర ఉన్న వారికి సాధారణంగా బదిలీలు ఉండవు.
- ప్రత్యేక వర్గాలకు ప్రాధాన్యత, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో వున్న ఉద్యోగులకు బదిలీలల్లో ప్రాధాన్యత ఉంటుంది.
- దృష్టి లోపం, వినికిడి లోపం, శారీరకంగా చలన పరిమితులున్న ఉద్యోగులకు వారు కోరుకున్నచోటుకు బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు.
- వైద్య పరమైన కారణాలను పరిగణలోకి తీసుకుంటారు.
- మహిళా ఉద్యోగులకు సాధ్యమైనంత వరకు భర్త పనిచేసే చోటుకు బదిలీ చేస్తారు.
- ఒంటరి మహిళ స్వస్థలానికి కాని, కోరుకొన్న ప్రాంతానికి కాని బదిలీ చేసే అవకాశం ఉంది.
- 40 శాతం అంగవైకల్యం ఉన్న ఉద్యోగులకు వారి సామర్థ్యాన్ని బట్టి బదిలీలు ఉంటాయి.
- వచ్చే నెల రెండో తేదీ నాటికి బదిలీలు పూర్తి చేయాలి. మూడో తేదీ నుంచి తిరిగి బదిలీలపై నిషేధం వుంటుంది.
- స్థాయిని బట్టి బదిలీలకు కౌన్సిలింగ్ తేదీలను ఇస్తారు. ఈ నెల 24లోపు బదిలీలకు దరఖాస్తులు చేసుకోవాలి. ఆ తర్వాత తర్వాత బదిలీల ప్రక్రియ వేగవంతం అవుతుంది.

ఈఏపీ సెట్‌కు 50 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీ సెట్‌లో భాగంగా మంగళవారం అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు కొనసాగాయి. సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు పరీక్ష కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులలో 161 మంది చొప్పున విద్యార్థులను కేటాయించగా 149, 152 మంది హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కాలేజీ కేంద్రంలో 150, 147 మంది విద్యార్థులకు 141మంది చొప్పున హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 190 మంది చొప్పున కేటాయించగా 181, 185 మంది హాజరయ్యారు. మొత్తం ఉదయం షిఫ్ట్ 501మందికి 471, మధ్యాహ్నం షిఫ్ట్ 498 మందికి 478మంది విద్యార్థులు హాజరు కాగా, మొత్తం 50మంది గైర్హాజరయ్యారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం నుంచి ఈ నెల 27వరకు ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతాయి.

ఐసెట్‌లో 794 మందికి అర్హత

ఎంసీఏ, ఎంబీఏ ప్రవేశాలకు ఈ నెల 7న నిర్వహించిన ఐసెట్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాలో ఈ పరీక్షకు మొత్తం 952మంది అభ్యర్థులు దరఖాస్తుచేసుకోగా 826 మంది హాజరయ్యారు. వారిలో 794మంది అర్హత సాధించారు. ఉత్తీర్ణుల్లో 399 మంది బాలలు, 395 మంది బాలికలు ఉన్నారు.

గండి పూడ్చండి



నూజివీడు పెద్దచెరువుకు పడిన గండి

- నూజివీడు పెద్ద చెరువుకు గండి
- 8 నెలలుగా పట్టించుకోని అధికారులు
- రామిలేరులో కలుస్తున్న వర్షపు నీరు
- భూగర్భ జలమట్టంపై ప్రభావం

నూజివీడు, మే 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పెద్ద చెరువుకు గండిపడి 8 నెలలైనా నేటికీ పూడ్చలేదు. గత ఏడాది ఆగస్టులో భారీ వర్షాలకు చెరువుకు గండిపడి పట్టణంలో పల్లపు ప్రాంతాలన్ని మునిగాయి. పట్టణ ప్రజలు మూడురోజుల పాటు ముంపులో ఉండిపోయారు. చెరువుకు ఒక పెద్దగండి, రెండు చిన్నగండ్లు పడ్డాయి. పెద్దగండి పడినచోట రూ.2 కోట్లతో కాంక్రీట్ కట్టలు నిర్మించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రభుత్వానికి పంపి ఏడు నెలలైనా ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. ఈ లోపు పలుమార్లు వర్షం పడడంతో చెరువు నీరు రామిలేరులో కలిసిపోయింది. సుమారు 200 ఎకరాలు విస్తీర్ణం గల చెరువులో నీరు నిల్వఉంటే భూగర్భ జల మట్టం పెరిగి ఉండేది. చెరువు కింద ఆయకట్టు విస్తీర్ణం తక్కువగానే ఉన్నా పట్టణంలో భూగర్భ జలాల పెంపుదలకు చెరువు ఇప్పటివరకు ఉపయోగపడుతూ వస్తోంది. చెరువులో చుక్కనీరు లేకపోవడంతో భూగర్భ జలాలు మరింత లోతుకు వెళ్లిపోవడమే కాక రాత్రివేళ అక్రమంగా మట్టి తోలకాలు కూడా సాగుతున్నాయి. చెరువు గండ్లను పూడ్చి ఉంటే ఇప్పటివరకు వర్షపు నీరు చెరువుల్లో నిల్వ ఉండేది. అక్రమ మట్టి తోలకాలకు ఆస్కారం ఉండేది కాదు. నూజివీడు పట్టణంలో భూగర్భజలాల మట్టం పెరిగేది.

మట్టి తవ్వేస్తున్నారు



చెరువులో మట్టి తవ్వకం

గండి పడిన చెరువులో మట్టి తవ్వకాలు ఊపందుకున్నాయి. సోమవారం అర్ధరాత్రి పెద్ద చెరువులో 15 ట్రాక్టర్లు, జేసీబీతో మట్టి తోలకాలకు అక్రమార్కులు ప్రయత్నించారు. స్థానికులు అడ్డుకుని అధికారులకు సమాచారం అందించారు. రాజకీయ ప్రమేయంతో అధికారులు కేసులు పెట్టకుండా వదిలేశారు.

నిధుల కోసం ఎదురుచూస్తున్నాం

పెద్దచెరువు గండి పూడ్చడానికి రూ.2కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారం. రెవెన్యూ శాఖ పరిశీలించాల్సి ఉంది. నియోజకవర్గంలోని 4 మండలాల్లో వివిధ చెరువుల మరమ్మతుల కోసం 100 పనులకు అవసరమైన నిధులు కూడా మంజూరు కోసం ప్రభుత్వాన్ని కోరాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

- వై.అర్జునరావు, ఇరిగేషన్ డీఈ

బొర్రంపాలెం సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

టి.నరసాపురం, మే 20(ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెం పంచాయతీ నిధుల దుర్వినియోగంతో సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ చెక్‌పవర్‌ను రద్దు చేసినట్లు ఎంపీడీవో మణికుమారి మంగళవారం తెలిపారు. సామాజిక కార్యకర్త గుండె పాండురంగ బొర్రంపాలెం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేపట్టారు. దుర్వినియోగం నిర్ధారణ కావడంతో సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. నిధులను రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఎంపీడీవో తెలిపారు.

టెన్త్ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు జిల్లాలో 754 మందికి కేవలం 155 మంది హాజరయ్యారు. ఏకంగా 599 మంది గైర్హాజరు కావడం గమనార్హం.

ఇంటర్ దూరవిద్య పరీక్షలు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియట్ తెలుగు పరీక్షకు 86 మంది దరఖాస్తు చేసుకోగా 71మంది హాజరయ్యారు. దూరవిద్య టెన్త్ ఇంగ్లీష్ పరీక్షకు 112 మంది దరఖాస్తు చేసుకోగా 89మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

నూజివీడుకు బయోగ్యాస్ ప్లాంట్

నూజివీడు, మే 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గానికి పరిశ్రమలు సాధించి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తానని నూజివీడు శాసనసభ్యుడు కొలుసు పార్థసారథి ఇచ్చిన హామీ కార్యరూపం దాలుస్తోంది. రాష్ట్రమంత్రివర్గం నేడు తీసుకున్న నిర్ణయాల్లో ఏలూరుజిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లి వద్ద నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ కంపెనీవారు 20 టీపీడీ కంప్రెస్‌డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయటానికి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇంధనశాఖ ఈ ప్రతిపాదనను ఆమోదిస్తూ రాష్ట్రమంత్రి మండలి ఆమోదం కోసం పంపింది. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదన ఆమోదిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్ట్‌ను రూ.150 కోట్ల పెట్టుబడితో పెట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కానుంది. దీని ద్వారా నూజివీడు నియోజకవర్గం పారిశ్రామికంగా ఒక అడుగు ముందుకు వేసిన ట్లేనని భావి స్తున్నారు. కంప్రెస్‌డ్ బయోగ్యాస్ అనేది పర్యావరణ అనుకూల మైన పునరుత్పాదక ఇంధనం. ఇది సేంద్రియ వ్యర్థాల నుంచి ఉత్పత్తి అవుతుంది. ఆటోమోటివ్, పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాల్లో సీబీజీ ఉత్పత్తి చేయబడిన బయోగ్యాస్‌ను శుద్ధిచేసి హైడ్రోజన్ సల్ఫైడ్, కార్బన్‌డైఆక్సైడ్, నీటిఆవిరిని తొలగించటం ద్వారా చేయబడుతుంది. శుద్ధిచేసిన ఈ బయోగ్యాస్‌లో 90 శాతం కంటే ఎక్కువ మిథేన్ ఉంటుంది. సీబీజీ ఉత్పత్తి, వ్యవసాయ వ్యర్థాలు, మున్సిపల్ వ్యర్థాలు, ఆహార వ్యర్థాల ద్వారా ఇది ఉత్పత్తి జరుగు తుంది. ఇది సీఎన్‌జీకి ఒక ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగపడు తుంది. అంతేకాదు సీబీజీ గృహాల కోసం కూడా ఉపయోగించవచ్చు. విద్యుత్ ఉత్పత్తికి కూడా ఇది ఉపయోగపడుతుంది.



బయోగ్యాస్ ప్లాంట్ నమూనా

ఏలూరులో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ !

మంత్రివర్గ సమావేశంలో గ్రీన్‌సిగ్నల్

దూరవిద్య యూజీ, పీజీ కోర్సులతో

అన్నివర్గాలకు విస్తృత విద్యాప్రయోజనాలు

ఏలూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఉన్నతవిద్యలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరున్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏలూరులో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి రాష్ట్రం విభజన కాలపరిమితి గతేడాది ముగియడంతో ఏడాది కాలంగా (2023-24) నిలిచిపోయిన యూనివర్సిటీ ప్రవేశాలను, కార్య కలాపాలను ఇకమీదట ఆంధ్రప్రదేశ్ నుంచే ఏలూరు ప్రధానకేంద్రంగా మళ్లీ ప్రారంభించ డానికి మార్గం సుగమమైంది. గతేడాదివరకు ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించి హైదరాబాద్ కేంద్రంగా విశ్వవిద్యాలయం కార్యకలాపాలు జరిగాయి. రాష్ట్ర విభజన అనంతరం పదేళ్ల కాలపరిమితి గతేడాది ముగి యడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం అడ్మిషన్లను నిలిపివేసింది. దీంతో రాష్ట్ర విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రాష్ట్రానికి సంబంధించి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ప్రధాన కేంద్రాన్ని ఏలూరులోనే నెలకొల్పడం ద్వారా దూరవిద్యా విధానంలో యూజీ, పీజీ కోర్సులు చేయాలనుకునే అభ్యర్థులకు విస్తృత విద్యాప్రయోజనాలతో వెసులుబాటు కల్పించింది.

ఏలూరులో యూనివర్సిటీ ఎక్కడ..?

1984లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్‌ను ఏలూరు సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాల ప్రాంగణంలోని ఓ భవనంలో ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీకి వున్న 70 స్టడీసెంటర్లలో ఏటా కొత్తగా 30 వేల అడ్మిషన్లు జరుగుతుండగా, ఆయా కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు, బ్యాక్‌లాగ్ విద్యార్థులు కలిపి మొత్తంమీద ఒక లక్షమంది ఉంటారని అంచనా. జిల్లాకు సంబంధించి ఏలూరు, భీమవరం, తణుకు, నల్లజర్ల, చింతలపూడిలలో స్టడీ సెంటర్లు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఏలూరులో కొత్తగా ఏర్పాటవుతోన్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎక్కడ ఉంటుందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. యూనివర్సిటీకి కొత్తగా భవనాలు నిర్మించడానికి అవసరమైన భూముల గుర్తింపు, సేకరణ, నిధుల విడుదల, తదితర మౌలిక వసరులు కల్పించేలోగా కొంతకాలం పాటు అందుబాటులో వున్న భవనాల్లో కార్యకలాపాలను ప్రారంభించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ప్రతిష్టాత్మక ఏపీ నిట్ తొలుత ఏలూరుకు మంజూరు కాగా, నగర శివార్లలోని వట్లూరు చెరువు భూములను నిట్ భవన నిర్మాణాల కోసం కేటాయిం చడం, ఆ మేరకు నిర్మాణాలు పూర్తయ్యేలోగా స్థానికంగా అన్ని వసతులున్న సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భవనాల్లో తరగతులను ప్రారంభించడానికి అప్పట్లో సన్నాహాలు జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలోనే తాజాగా ఏలూ రుకు మంజూరైన అంబేడ్కర్ విశ్వ విద్యాలయానికి నూతన భవనాల నిర్మాణం జరిగేలోగా యూనివర్సిటీ అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ కార్యకలా పాలను స్థానికంగా అన్ని సౌకర్యాలున్న ఏదైనా విద్యా సంస్థకు చెందిన భవనాల్లో తాత్కాలిక ప్రాతిపదికన ప్రారంభించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. సాధార ణంగా ఏటా జూన్ నుంచి మరుసటేడాది ఏప్రిల్ వరకు అంబేడ్కర్ యూనివర్సిటీ ఆఫర్ చేసే కోర్సులకు విద్యా సంవత్సరంగా ఉంటోంది. సెమిస్టర్ల పద్ధతిన జరిగే వార్షిక పరీక్షలు ఏటా నవంబర్ /డిసెంబరు, ఏప్రిల్/ మే నెలల్లో నిర్వహి స్తారు. ఇప్పటికే ఒక ఏడాది అడ్మిషన్లు నిలిచిపోయిన నేపథ్యంలో జూన్ నుంచి ప్రారంభమయ్యే నూతన విద్యాసంవత్సరంలోనే యూని వర్సిటీ అకడమిక్ కార్యకలాపాలను పునరుద్ధరిస్తారని భావిస్తున్నారు. కొత్తగా ఏర్పాటవుతోన్న అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కోసం ఒక ఉపకులపతి, రిజిస్ట్రార్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, బోధనకు ఫ్యాకల్టీ, పరిపాలనా విభాగం, బోధనేతర సిబ్బంది నియా మకాలు జరగాల్సి ఉంది. ఏలూరు కేంద్రంగా ఏర్పాటవుతోన్న యూనివర్సిటీ స్థాపన ప్రాంతం, ఈలోగా కార్య కలాపాలను ఎక్కడ నిర్వహి స్తారన్న విషయంపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

అతి తక్కువ ఫీజులతో ఉన్నత విద్యావకాశాలు

1982లో స్థాపించిన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సి టీలో దూరవిద్యా విధానంలో వివిధ డిగ్రీ, పీజీ, డిప్లొమా, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు, మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటు, ఏ యూని వర్సిటీలోను లేనివిధంగా బీఈడీ కోర్సును దూరవిద్యా విధానంలో చదివేందుకు అవకాశం ఉంది. జాతీయ స్థాయి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డెక్) అనుమతి ఉండటంతో యూనివర్సిటీ జారీచేసే సర్టిఫికెట్లతో ప్రభుత్వోద్యోగాలు కూడా పొందవచ్చు. ముఖ్యంగా ఇంటర్ ఉత్తీర్ణతతో ప్రభుత్వోద్యోగాలు చేస్తున్నవారు పదోన్న తులు పొంద డానికి అవసరమైన డిగ్రీ, పీజీ కోర్సులను అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పూర్తిచేయడానికి అనువుగా ఉంటోంది. గృహిణులు, వ్యాపారులు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు, పేదవర్గాలకు చెందినవారికి తక్కువ ఫీజుల్లోనే ఉన్నతవిద్యను అభ్యసించ డానికి యూనివర్సిటీ ప్రత్యేకతగా చెప్పవచ్చు. రెగ్యులర్ తరగతులకు అవసరమైన హాజరుతో నిమిత్తం లేకుండా వారాంతపు రోజులు, పండుగల్లో కాంటాక్టు క్లాసులను నిర్వహిస్తుండటం వల్ల అడ్మిషన్లు తీసుకున్నవారికి అనువుగా ఉంటోంది. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేయడానికి సుమారు రూ.3,200, పీజీ విద్యకు సుమారు రూ.5 వేలు కోర్సు మెటీరియల్‌తో సహా ఏడాది కాలానికి ఉంటోంది. ఈ వెసులుబాటును ఉపయోగించుకుని యూనివర్సిటీలో చదివిన పలువురు అభ్యర్థులు ఐఏఎస్, తదితర ఆలిండియా సర్వీసులు కూడా చదివిన వారుండటం గమనార్హం.



ఏలూరులోని అంబేడ్కర్ స్టడీ సెంటర్





బంగారు మిశ్రమంను సీల్ వేస్తున్న జ్యూవెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు... బంగారు వస్తువుల వివరాలను బ్యాంకు అధికారులకు అందిస్తున్న ఈవో మూర్తి

హుండీల ద్వారా శ్రీవారికి 4.940 కేజీల బంగారం

ఎస్‌బీఐలో డిపాజిట్ చేసిన ఆలయ అధికారులు

ద్వారకాతిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారికి హుండీల ద్వారా లభించి, ఆలయ స్ట్రాంగ్ రూములో గతేడాది కాలంగా భద్రపరి చిన ఆలయ, ఉప, దత్తత దేవాలయాలకు సంబంధించిన బంగారు మిశ్రమాన్ని మంగళ వారం విజయవాడ, భారతీయ స్టేట్‌బ్యాంకుకు అప్పగించారు. గోల్డ్‌బాండ్ స్కీమ్ ద్వారా 4.940 కేజీల బంగారాన్ని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణ మూర్తి, డిప్యూటీ కమిషనర్ బాబూరావు, జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు, అర్చకుడు కొండూరి జనార్దనా చార్యులు సమక్షంలో బ్యాంకు అధికారులకు అప్పగించారు. ఆలయ ఏఈవోలు శ్రీనివాస్, నటరాజారావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పెదమల్లం మాచేనమ్మ జాతర

ఆచంట, మే 20 (ఆంధ్రజ్యోతి): పెదమల్లం మాచేనమ్మ, పల్లాలమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారి ఊయల సేవ కార్య క్రమం నిర్వహించారు. భక్తులు నిప్పుల గుండాలు తొక్కారు. సోమవారం రాత్రి అమ్మవారి పెద్ద జాతర కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నిప్పులగుండం తొక్కుతున్న భక్తులు

60 వేల ఎకరాల్లో ఆక్వా క్రాప్ హాలిడేకు సిద్ధం

జూన్ 10న ఆక్వారైతుల చలో అమరావతి

ఆక్వా సంఘ చైర్మన్ గాంధీభగవాన్‌రాజు

పాలకొల్లు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : గత నెల 7న జరిగిన ఆక్వారైతుల సమా వేశంలో రైతులందరూ ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయం ప్రకారం పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లోని సుమారు 60 వేల ఎకరాల్లో ఆక్వా క్రాప్ హాలిడే పాటిస్తున్నామనీ, ఇప్పటికే 20 వేల ఎకరాల్లో రైతులు హాలిడే పాటించారని పాలకొల్లు జైభారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు అన్నారు. పాలకొల్లులో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూలై,ఆగష్టు, సెప్టెం బరు మూడు నెలలు పాటు క్రాప్ హాలిడేను పాటించి, అక్టోబరు 1నుంచి తిరిగి మొదలు పెడతామన్నారు. రొయ్యపిల్లలు విక్ర యించే హేచరీలు నుంచి, మేత కంపెనీలు, కొనుగోలు దారుల వరకూ అందరూ సిండికేట్ అయ్యి ఆక్వారైతులను నిలువునా దోపిడీ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా పరిశ్రమలపై ట్రంపు విధించిన సుంకాన్ని అస్త్రంగా తీసుకొని కొను గోలు కేంద్రాలు ఇప్పటికీ రైతులు నుంచి రొయ్యలను అడ్డగోలుగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఆక్వా సమస్యలపై జూన్ 10న చలో అమరావతి చేపడుతున్నామని ఆక్వా రైతులు, కార్మికులు తరలివెళ్లి ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి అచ్చెన్నాయు డుకి ఆక్వా సమస్యలను వివరిస్తామన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గాంధీ భగవాన్‌రాజు

ఏలూరులో ముగిసిన జాతీయస్థాయి నాటిక పోటీలు

ఏలూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు జరిగిన ఆలపాటి రామచంద్ర రావు జాతీయస్థాయి తెలుగు నాటిక పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. వైఎంహెచ్ఏ, హేలాపురి కళాపరిషత్తు సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న నాటిక పోటీల్లో భాగంగా మంగళవారం ప్రదర్శించిన నాటికలు ఆలోచనాత్మకంగా సాగాయి. ఆధు నిక ఆడపిల్లల స్వతంత్ర భావనలు, ఆడ పిల్లలు భారం అన్నట్లుగా నమ్మే వక్ర భావజా లాన్ని సూటిగా విమర్శించిన రుతువు లేని కాలం, ఓ సామాన్య మహిళ రైల్వే శాఖపై సంధించిన అస్త్రంగా సాగిన జనరల్ బోగీలు నాటికలు ఆలోచింపచేశాయి. పోటీలను తిల కించేందుకు వచ్చిన ప్రేక్షకులతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కన్న కొడుకు ఆచూకీ తెలి యక ఓ తల్లి చెందే ఆవేదన పోరాటమే జన రల్ బోగీలు. రైలు ప్రమాదాలలో జనరల్ బోగీలలో ప్రయాణించే ప్రయాణికులు మర ణించిన సందర్భాలలో వారి చిరునామాలు రైల్వేశాఖ వద్ద ఉండని విషయం కూడా అందరికీ తెలిసిందే. అలాంటి ప్రమాదంలో త న కొడుకును దూరం చేసుకున్న ఓ తల్లి సావి త్రమ్మ రైల్వేశాఖతో పాటు ప్రజా ప్రతినిధు లకు ఉత్తరాల ఉద్యమం ప్రారంభించి సమ స్యకు ఎలాంటి పరిష్కారం చూపిందన్న ఇతి వృత్తంతో సాగిన నాటిక శ్రీ సాయి ఆర్ట్స్ కొలక లూరు వారు ప్రదర్శించిన జనరల్ బోగీలు పీటీ మాధవ్ రచించగా గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. నాటికలో సావిత్రమ్మ పాత్రధారిగా నటించిన సీనియర్ సురభి ప్రభావతి తన నటనా కౌశలంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కుటుంబ బంధాన్ని తెలియజె ప్పిన రుతువు లేని కాలం వర్తమానంలో ఆడపిల్లలు భర్త కావాలి అత నికి తల్లితం డ్రులు, తోబుట్టువులు ఉండకూడదు అలాంటి వ్యక్తి దొరికే వరకు పెళ్ళి కూడా చేసుకోవడం లేదు. కుటుంబ బంధాలు తెలియజెప్పిన రుతువు లేని కాలం నాటిక కళానికేతన్ వీరన్న పాలెం వారు ప్రదర్శించిన ఈ నాటిక శ్రీఅగస్త్య రచించగా వైబి చౌదరి దర్శకత్వం వహించారు. సినీ నిర్మాత అంబికా కృష్ణ, వైఎంహెచ్ఏ ప్రతి నిధులు కేవీ సత్యనారాయణ, మజ్జి కాంతా రావు, సోమలింగేశ్వరరావు, తదితరులు పర్య వేక్షించారు.



జనరల్ బోగి నాటకంలో సన్నివేశం

ఉప్పు రైతుల ఆశలపై నీళ్లు

సీజన్‌లో వరుస వానలు


నీట మునిగిన ఉప్పు మడులు

ధర బాగున్నా కలిసిరాని కాలం



ఉప్పురాశులు తడవకుండా కప్పిన బరకాలు

నరసాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉప్పు రైతుల ఆశలపై అకాల వర్షాలు నీళ్లు చల్లాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నరసాపురం, మొగల్తూరు మండలాల్లో వందలాది ఎకరాల పంట నీట మునిగింది. సీజన్‌లో వర్షాలు కురవడంతో చేతికొచ్చిన పంట నీటిపాలైంది. దీంతో రైతులు నష్టాలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వం నుంచి సరైన ప్రొత్సాహం లేకపోవడంతో ఈ ఏడాది తీరంలో ఉప్పు విస్తీర్ణం తగ్గింది. నరసాపురం మండలంలోని బియ్యపుతిప్ప, చినలంక, పీఎం లంక, మొగల్తూరు మండలంలోని కేపీపాలెం, మోళ్లపర్రు ప్రాంతాల్లో కేవలం 1500 ఎకరాల్లో మాత్రమే ఉప్పు సాగు చేస్తున్నారు. సీజన్ ఆరంభంలో ప్రకృతి అనుకూలంగా ఉండటంతో రైతులు దిగుబడిపై కోటి ఆశలు పెట్టుకున్నారు. అయితే ఎండలు ఎక్కువగా ఉండే మే నెలలోనే అకాల వర్షాలు కురవడంతో రైతులు నిండా మునిగారు. చదును చేసిన రాశులన్నీ నీటి మునిగాయి. దీంతో మళ్లీ పెట్టుబడులు పెట్టి సాగు చేయాలంటే ప్రకృతి అనుకూలిస్తుందా ? లేదా అన్న భయం రైతాంగంలో నెలకొంది. ఎకరాకు రూ.50 నుంచి రూ.60 వేలు పెట్టుబడులు అవుతాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు అధికంగా ఉండటంతో దిగుబడి కూడా ఎక్కువగా వస్తుంది. అయితే ఈసారి మే నెలలోనే వరుస వర్షాలు కురిశాయి. ఇప్పటికే రెండు సార్లు వానలు పడ్డాయి. జూన్ వరకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని , రెండు సార్లు వర్షాలు పడినప్పుడల్లా మడులకు పెట్టుబడులు పెడుతూ వచ్చారు. అయితే రెండు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో పూర్తిగా నీట మునిగాయి. దీంతో రైతులు గట్లుపై ఉంచిన ఉప్పురాశుల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్నారు. కొందరు ప్లాస్టిక్ కవర్లు కప్పి ఉప్పు కరగకుండా రక్షించుకునే ప్రయత్నం చేశారు. ఎండలు ఎక్కువగా ఉండే మే నెలలోనే వర్షాలు కురవడంతో పెట్టిన పెట్టుబడులు దక్కలేదని రైతులు వాపోతున్నారు.



నీట మునిగిన ఉప్పుమడులు

• సీజన్ కలిసి రాలేదు

ఈసారి ప్రకృతి అనుకూలించలేదు. గతంలో ధర ఉండేది కాదు. ప్రస్తుతం కేజీ రూ.6 నుంచి రూ.9 వరకు ఉంది. పంట దిగుబడి బాగా వస్తే లాభదాయకంగా ఉంటుందని, అప్పులు తెచ్చి మరీ సాగు చేశాం. అయితే ఈసారి మే నెలలోనే వర్షాలు పడ్డాయి. ఇప్పటికే రెండు సార్లు పెట్టుబడులు పెట్టాం. ఇక అప్పులు తెచ్చి సాగు చేయలేం.

- శివ, ఉప్పు రైతు, పీఎం లంక

ధాన్యం ఇంకా ఉంది..

లక్ష్యానికి చేరువుగా సేకరణ

ఏలూరు జిల్లాలో కొనుగోలు లక్ష్యం 2.70 లక్షల టన్నులు

ఇప్పటికే 2.50 లక్షల టన్నులు కొనుగోలు

ఏలూరు సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలులో తొలుత లక్ష్యం తక్కువగా నిర్దేశించడంతో రైతులు తమ ధాన్యం ఎవరు కొంటారని ఆందోళన చెందారు. ఈ విషయంపై కొనుగోళ్ల లక్ష్యం పెంచాలని రైతులు డిమాండ్‌పై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురి తమైంది. జిల్లా వ్యాప్తంగా రైతుల వద్ద ధాన్యం మిగిలి ఉన్నదని జేసీ ధాత్రిరెడ్డి పర్యటనలో తేలింది. దీనిపై ప్రభుత్వానికి ప్రతి పాదనలను పంపగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు సంబంధించి తొలుత నిర్దేశించిన లక్ష్యం 2.20 లక్షల మెట్రిక్ టన్నులను 2.70 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచింది. ఈక్రమంలో ఇప్పటికే జిల్లాలో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా మిగిలిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరంగా కొనసాగు తోంది. రాష్ట్ర ప్రభుత్వం అవసరానికి అనుగుణంగా నాణ్యమైన గోనెసంచులు సమకూర్చడంతో పాటు 24 గంటల లోప చెల్లింపులతో మద్దతు ధర లభించడంతో అన్నదాతల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఉన్న రైతు సేవాకేంద్రాల ద్వారా 62,50,968 గోనె సంచులను రబీ ధాన్యం కొనుగోలుకు అందుబాటులో ఉంచారు. లక్ష్య సేకరణలో మిగిలిన 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సరిపడా గోనె సంచులు రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 20,225 మంది రైతుల నుంచి రూ. 575 కోట్లు విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ. 485.82 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేసేం దుకు జిల్లాస్థాయిలో 08812-230448, 77020 03584, 75695 62076 నంబర్లతో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

పశ్చిమలో 30 వేల టన్నులు రైతుల వద్దే..

భీమవరం రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఈ దాళ్వా పంట మాసూళ్ళలో అకాల వర్షాలు పలుమార్లు ఆటంకాలు కలిగించినా పంట దాదాపు గట్టెక్కేసింది. అయినప్పటికీ ఇంకా కొంత ధాన్యం రైతుల వద్దే ఉండిపోయింది. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ధాన్యం అమ్మకాలకు వీలు లేకుండాపోయింది. పంట కోతలు పూర్తిగా అయినందున వర్షాల ప్రభావం పెద్దగా రైతన్న లపై లేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో 30 వేల టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ దాళ్వా పంటలో ఇప్పటి వరకు 6.96 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మిగిలిన 30 వేల టన్నుల ధాన్యానికి సంచులు అందుబాటులో ఉంచారు. వర్షాలు నిలిచాక అమ్మకం చేయాలని, అప్పటి వరకు ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ వెంకటే శ్వర్లు తెలిపారు.







ఆకివీడు సాలిపేటలో సీసీ రోడ్‌పై నిలిచిన వర్షపు నీరు.. ఉండిలో జోరుగా కురుస్తున్న వాన

ముంచెత్తిన వాన

కలిదిండి మండలంలో అత్యధికంగా 81.2 మిల్లీ మీటర్ల వర్షపాతం

ఏలూరుసిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): బంగా ళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవ ర్తనంతో జిల్లాలో పలుప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కలిదిండి మండలంలో 81.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 16 మి.మీ నమోదైంది. ఏలూరు జిల్లాలోని 13 మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఈదురు గాలులు, పిడు గులతో కూడిన వర్షాలు కురవడంతో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ప్రధాన పట్టణాల్లో జనజీవనం స్థంభించింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మరో మూడురోజుల పాటు జిల్లాలో భారీగానే వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

వర్షపాతం ఇలా :

ముదినేపల్లిలో 80.4 మి.మీ, మండవల్లిలో 72.4, కైకలూరులో 51.6, పెదవేగిలో 28.2, ఏలూరు అర్బన్ 20.6, పెదపాడు 18.8, ఏలూరు రూరల్ 18.4, భీమడోలు 15.8, దెందు లూరు 14.4, ముసునూరులో 14.2, నూజివీడు 9.8, ఉంగుటూరు 9.6, ఆగిరిపల్లి 5.8, నిడమర్రు 4.4, కామవరపుకోట 1.4, కుక్కు నూ రులో 1 మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి పార్థసారథి

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఏలూరు జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వ్యవసాయ, పశుసంవ ర్ధక, విద్యుత్, రహదారులు, భవనాలు శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వాతావరణ కేంద్రం హెచ్చరికలను అనుగు ణంగా చర్యలు తీసుకోవాలన్నారు.

కాళ్ళలో అత్యధికంగా 42.2 మి.మీ

భీమవరం టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం ఉదయం జిల్లా అంతటా వర్షాలు కురిశాయి. పలు చోట్ల భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫ రాకు అంతరాయం ఏర్పడింది. కాళ్ళలో 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా పెంట పాడులో 14.6 మి.మీ తణుకు 15.2, అత్తిలి 27.8, గణపవరం 10.4, ఆకివీడు 19.8, ఉండి 21.2, పాలకోడేరు 30.4, పెనుమంట్ర 10.4, ఇరగవరం 10,పెనుగొండ 10.8, ఆచంట 20.2, పోడూరు 33.2, వీరవాసరం 35, భీమవరం 29.6, మొగల్తూరు 25.6, నరసాపురం 23.6, పాలకొల్లు 30.2, యలమంచిలి 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఏలూరు మీదుగా వెళ్లే ఆరు రైళ్లు రద్దు

ఏలూరు క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు మీదుగా నడుస్తున్న ఆరు రైళ్లను వివిధ కారణాల వల్ల రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రైల్ నెంబర్ 22849 షాలిమర్ నుంచి బయలుదేరి సికింద్రాబాద్ వెళ్ళే రైలు ఈనెల 21వ తేదీన రద్దు చేశారు. సత్రగంజి నుంచి ఈనెల 22న బయలుదేరి యశ్వంతపూర్ వెళ్ళే రైలు (02863) రద్దు చేశారు. హౌరా నుంచి ఈనెల 23వ తేదీన బయలుదేరి మైసూర్ వెళ్ళే రైలు(22817) రద్దు చేశారు. ఈనెల 23వ తేదీన సికింద్రా బాద్ నుంచి బయలుదేరి షాలిమార్‌కు వెళ్ళే రైలు (22850), యశ్వం త్‌పూర్ నుంచి ఈనెల 24న బయలుదేరి సత్రగంజి వెళ్ళే రైలు (02864),మైసూర్ నుంచి ఈనెల 25వ తేదీన బయలుదేరి హౌరా వెళ్లే రైళ్లను (22818) రద్దు చేశారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్.. అధికారిక ఉత్తర్వులు

ఏలూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా కేఎస్ జవహర్‌ను రెండేళ్ల కాలానికి నియమిస్తూ సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ సెక్రటరీ ఎంఎం నాయక్ అధికారిక ఉత్తర్వులు మంగళ వారం జారీ చేశారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ఎక్సైజ్‌శాఖ మంత్రిగా కేఎస్ జవహర్ గతంలో పనిచేశారు. పార్టీకి వెన్నంటే ఉండి పలు ఆందోళనల్లో జవహర్ కీలక పాత్ర పోషించారు.

ఆంధ్రజ్యోతి
ఏలూరు
ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం
7 www.andhrajyothy.com ● బుధవారం 21 మే 2025

ఇంటర్ విద్యార్థులను చేర్చుకోండి

కామవరపుకోట, మే 20(ఆంధ్రజ్యోతి) : ఎంతో చరిత్ర కలిగిన శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలను మూసివేసే ఆలోచనను దేవస్థానం విరమించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించకపోవడంతో ఆర్ఐఓ యోహాను మంగళవారం కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్‌తో మాట్లాడగా తమ అధిష్ఠానం ప్రవేశాలకు దరఖాస్తులు తీసుకోమంటే తాము స్వీకరిస్తామని చెప్పారు. కళాశాలలో దరఖాస్తులు స్వీకరించడంలేదని నిర్ధారణ అయ్యిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని ఆర్ఐఓ యోహాన్ స్పష్టం చేశారు. మరోవైపు శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రవేశాలు కొనసాగించేలా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఉపాధి బకాయిలు విడుదల చేయాలి

బుట్టాయగూడెం, మే20(ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నాయకులు నిరసన తెలిపారు. సీఐటీ యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామా ముత్యాలమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక వ్యవసాయ కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంద న్నారు. పనిప్రదేశాల్లో మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీసం వేతనం అమలు చేయాలని కోరారు. జూలై 9న జరగబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీడీవో కె. జ్యోతికి వినతిపత్రం అందజేశారు.





నేడు ఎమ్మెల్యే ధర్మరాజు పుట్టిన రోజు వేడుకలు

ఉంగుటూరు/భీమడోలు/గణపవరం, మే 20(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు జన్మదిన వేడుకలు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరగనున్నాయని కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం భీమడోలు జనసేన నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. భీమడోలు మండల పార్టీ అధ్యక్షుడు ప్రత్తి మదన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సుబ్రహ్మణ్యం, యర్రంశెట్టి వాసు, అజైయ్, సునీల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


పూలబొకేలు వద్దు... విద్యా సామగ్రితో రండి..

ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి రావాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బుధవారం ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకను పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చేవారంతా పూల దండలు, బోకేలు, కేకులు, స్వీటు బాక్సులతో రావద్దని, పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోటు పుస్తకాలు, విద్యాసామగ్రి తీసుకురావాలన్నారు.



రోగులకు పండ్లు అందజేస్తున్న జనసేన నాయకులు

ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని మంగళవారం మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ సూరత్తుల అయ్యప్ప జ్యోతి ఆధ్వర్యంలో ఉంగుటూరులో మెగారక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు పత్సమట్ల భీమరాజు పాల్గొని కేక్ కట్ చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడియాల రవిశంకర్‌లు పాల్గొన్నారు.





సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

చింతలపూడి/వేలేరుపాడు, మే 20(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి తాలూకాలో జూలై 5, 6, 7 తేదీల్లో జరిగే జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.వసంతరావు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు.వేలేరుపాడు మండలంలోని తిప్పలగుంపు, ఉదయ్‌నగర్, పూచిరాల, గ్రామాల్లో సీపీఐ గ్రామ శాఖల సమావేశాలు మంగళవారం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య పాల్గొని మాట్లాడుతూ చింతలపూడిలో నిర్వహించే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

కాగుపాడులో ఫీవర్ సర్వే

ఉంగుటూరు, మే 20(ఆంధజ్యోతి) : కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం ఫీవర్ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి వైద్యాధికారిణి మానస సమీక్షించారు. కార్యక్ర మంలో మలేరియా యూనిట్ తాడేపల్లిగూడెం శాఖ అధికారి వై.వి.లక్ష్మణరావు, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, పర్యవేక్షకులు సత్య నారాయణ, పి.హెచ్.ఎన్.సరోజిని తదితర సిబ్బంది పాల్గొన్నారు.

6వ రోజుకు రిలే దీక్షలు

బుట్టాయగూడెం, మే 20(ఆంధ్రజ్యోతి) : గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయా లని, ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీని ప్రకటించా లని, షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామ కాల చట్టం చేయాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ పిలుపులో భాగంగా మండల కేం ద్రంలో ఆదివాసీలు చేపట్టిన రిలే నిరహార దీక్షలు 6వ రోజుకు చేరాయి. పార్టీలకతీతం గా మంగళవారం దీక్షల్లో ప్రజాప్రతినిధులు తెల్లం రమణ, గుగ్గులోతు మోహనరావు, గాలి దుర్గారావు, కారం రాఘవ పాల్గొనగా ముక్కయ్య దీక్షలను ప్రారంభించారు.

డ్వాక్రా మహిళల అవసరాల మేరకు రుణాలు

▸▸ సెర్ప్ రాష్ట్ర సీఈవో కరుణ

దెందులూరు, మే20(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు వారి అవసరాలను గుర్తించి రుణాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళ్తుందని రాష్ట్ర వెలుగు(సెర్ప్) సీఈవో వాకాటి కరుణ అన్నారు. మంగళవారం దెందులూరు మండలం కొవ్వలిలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, వెలుగు ఏపీఎం పులి సురేష్‌తో కలిసి డ్వాక్రా సంఘాలతో ఆమె సమావేశం నిర్వహించారు. అనంతరం దెందులూరులోని సెర్ప్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. డ్వాక్రా మహిళలు స్వయంగా చిన్నచిన్న వ్యాపారాలు పెట్టుకుని అభివృద్ధి చెందేందుకు షాపులు, దుకాణాలను ఏర్పాటు చేసుకుంటే వారి యూనిట్‌కు అవసరమైన రుణాలు అందించాలని సెర్ప్ అధికారులకు సూచించారు. దెందులూరు ఎంపీడీవో శ్రీదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, ఎం.నాని, జి.కొండయ్య చౌదరి పాల్గొన్నారు.

రూ. 2,182.16 కోట్ల రుణాలు లక్ష్యం

పెదపాడు : ఏలూరు జిల్లాలో డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2182.16 కోట్ల రుణ ప్రణాళిక లక్ష్యంగా నిర్ధేశించామని సెర్ప్ సీఈవో కరుణ తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులోని టెక్నికల్ ట్రైనింగ్ అభివృద్ధి సెంటర్‌లో డీఆర్డీఏ అధికారులు, సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమక్షంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

ఆదరణ పనిముట్ల అక్రమాలపై దర్యాప్తు

పెదవేగి, మే 20(ఆంధ్రజ్యోతి): కులవృత్తితో జీవనం సాగించే పేదలకోసం ప్రభుత్వం చేపట్టిన ఆదరణ-2 పథకం యూనిట్లు అనర్హుల చేతికి చేరడంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెట్రి సెల్వీ ఆదేశాలతో పెదవేగి మండలంలో పలుగ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయి విచారణ నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి, బీసీ వెల్ఫేర్ అధికారిణి ఆర్. నాగరాణి, జిల్లా పరిషత్ సీఈవో భీమేశ్వర రావులతో కూడిన త్రీమెన్ కమిటీ నిర్వహించిన బహిరంగ విచారణలో అసలు లబ్ధిదారులను పక్కనబెట్టి, మధ్యలో అనర్హులైన వారికి వైసీపీ నాయకులు ఆదరణ-2 పనిముట్లను పంపిణీ చేసినట్లు తేలింది. 2018-19 ఏడాదికి సంబంధిం చి అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ -2 పథకానికి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని, వారి వాటాసొమ్ము డీడీల రూపంలో చెల్లించారు. యూనిట్లు మంజూరై, పనిముట్లు ఎంపీడీవో కార్యాలయానికి రావడంతో లక్ష్మీపురంలోని దెందులూరు మార్కెట్ యార్డులో భద్రపర్చారు. అనంతరం ప్రభుత్వం మారడంతో వైసీపీ నాయకులు ఆ పనిముట్లను లబ్ధిదారులను కాదని, తమకు కావలసినవారికి అప్పజెప్పినట్లు విచారణలో గుర్తించారు. మొత్తం 132 యూనిట్లను అనర్హులైన 82మందికి పంపిణీ చేసినట్లు గుర్తించి, వాటిపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. విచారణ పూర్తిచేసిన తరువాత తదుపరి చర్యలు ఉంటాయని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ భీమేశ్వరరావు తెలిపారు.

వెబ్‌సైట్‌లో ఉమ్మడి జిల్లా వైద్య ఉద్యోగార్థుల మెరిట్ జాబితా

ఏలూరు అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో ఎన్‌యూ హెచ్‌ఎం పథకంలో కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయతలపెట్టిన గ్రేడ్-2 ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ జాబితాలను జిల్లా వెబ్‌సైట్లలో పొందుపర్చినట్టు ఉమ్మడి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని తెలిపారు. జాబితాల్లోని అభ్యర్థుల వివరాలపై ఏమైనా అభ్యంతరాలుంటే తగిన ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోగా ఏలూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నేడు గోపన్నపాలెంలో మినీ మహానాడు

దెందులూరు, మే 20(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ స్థాయి టీడీపీ మినీ మహానాడు గోపన్నపాలెంలో జరుగుతున్న నేప థ్యంలో దెందులూరు మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు), మోతుకూరి నానిబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించే మినీ మహానాడుకు మండల వ్యాప్తంగా తరలిరా వాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. మహానాడు లోనే దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం ఉన్న నేప థ్యంలో పెద్ద ఎత్తున టీడీపీ కేడర్ తరలిరాలన్నారు. కార్యక్ర మంలో మండల నాయకులు గారపాటి కొండయ్య చౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, మహేష్ యాదవ్, పసుమర్తి మధుబాబు, యలమర్తి శ్రీనివాస్, బోడేటి మోహన్‌బాబు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఏలూరు కార్పొరేషన్, మే 20(ఆంధ్రజ్యోతి) : నగరంలోని వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.






















హక్కులు, బాధ్యతలను మహిళలు తెలుసుకోవాలి

ద్వారకాతిరుమల, మే 20(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలు తమకున్న హక్కులను, బాధ్యతలను తెలుసుకోవాలని సెక్టార్‌సూపర్‌వైజర్ టి.మేరీ అన్నారు. ద్వారకాతిరుమల సచివాలయ పరిధిలోని ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం జరిగింది. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు అంశాలను, మహిళా చట్టాలను వారికి సమావేశంలో వివరించారు. మహిళా పోలీస్ లక్ష్మీసుజన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న రంగాల్లో మహిళలను, బాలికలకు శిక్షణనిచ్చి పోత్సహించాలన్నారు.

నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలి

కుక్కునూరు, మే 20(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగభృతి హామీని అమలు చేయాలని పీవైఎల్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు చుర్రా నవీన్, సోయం కార్తీక్ డిమాండ్ చేశారు. మంగళవారం లచ్చిగూడెం గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జంగారెడ్డిగూడెం డివిజన్ మహాసభలు జరిగాయి. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కోటి ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎస్.కె.గౌస్, చంద్రరావు, కన్నయ్య, ఎస్‌కే.మున్నీ పాల్గొన్నారు.

రెండు ప్రమాదాల్లో 28 మందికి గాయాలు

భీమడోలు, మే 20(ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనుల కోసం కూలీలతో వెళ్తున్న రెండు ఆటోలను ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ఘటనలో పది మంది మహిళలకు స్వల్పగాయాలు కాగా, నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన భీమడోలులో జరిగింది. మంగళవారం తెల్లవారు జామున ఉపాధి పనులకు రెండు ఆటోల్లో కూలీలు తరలి వెళ్లారు. కూలీలతో వెళ్తున్న ఆటోలను కాకినాడ వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమా దంలో 14 మందికి గాయాలయ్యాయి వీరిని భీమడోలు సామాజిక వైద్య కేంద్రా నికి, తీవ్రంగా గాయపడిన నలుగురిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టైరు పేలి కొబ్బరి లోడు వాహనం బోల్తా

ద్వారకాతిరుమల : ఎండుకొబ్బరి లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం వెనుక టైరు పేలడంతో అదుపుతప్పి తిరగబడ్డ ఘటన లయన్ గోపాలపురం జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. పెదవేగి మండలం వేగవరానికి ఎండు కొబ్బరిలోడుతో బొలేరో వాహనం వేగవరం, గోపన్నపాలెం గ్రామాలకు చెందిన 14 మంది కూలీలతో వెళ్తున్న వాహనం వెనుక టైరు పేలి అదుపుతప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వాన కిశోర్‌తో పాటు అంతా గాయపడ్డారు. వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తొలుత భీమడోలు ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చే యించారు. వీరిలో ఆంజనేయులు, సంతోష్, అప్పలనాయు డు, సత్యవతి, గంగా ధరరావులకు తీవ్రగాయాలవడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కె.ఎ.పాల్ శాంతిసభకు తరలిరండి

బుట్టాయగూడెం, మే 20(ఆంధ్రజ్యోతి) : ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కె.ఎ.పాల్ హైదరాబాదులో ఈ నెల 24న తలపెట్టిన శాంతి సభను జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ కోర్స చిన్నారావు పిలుపునిచ్చారు. కంగాలవారిగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ క్రీస్తు విశ్వాసులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కె.సియోన్ కుమార్, కె.పండు, కె.రత్న బాబు, కె.హేజ్కెలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఏలూరు క్రైం/భీమడోలు, మే 20(ఆంధ్రజ్యోతి) :భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై వ్యానులో ఎక్కుతుండగా వెనుక నుంచి మరో మినీ వ్యాన్ ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. రావులపాలెం నుంచి గుంటూరు వెళ్తున్న మినీ వ్యాన్ ఆగి ఉన్న మరో వ్యానును మంగళవారం రాత్రి బలంగా ఢీకొట్టింది. సోదరుడిని వ్యాను ఎక్కించేందుకు వచ్చిన ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామానికి చెందిన కోడూరి వెంకట రామ్ చరణ్(17) అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొన్న వ్యాన్‌లోని డ్రైవర్ గుంటూరు జిల్లా తుమ్మలపాలేనికి చెందిన మామిడి జైరావు, అతని భార్య ప్రశాంతి వ్యానులో చిక్కుకున్నారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అతి కష్టం మీద వారిని బయటికి తీసి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామ్ చరణ్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జీతాల చెల్లింపులో అన్యాయం సరికాదు

ఏలూరుటూటౌన్, మే20 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీర్ కార్మికుల జీతాల చెల్లింపులో జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు సోమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు గత ఆరు సంవత్సరాలుగా ఒక్కోకార్మికుడు రూ.4 లక్షలు నష్టపోయారని అన్నారు. స్కిల్డ్ వర్కర్లకు అన్‌స్కిల్డ్ వర్కర్లకంటే తక్కువ జీతాలు చెల్లిస్తూ అన్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వీ.రమేశ్, సోమేశ్వరరావు, సాంబశివరావు, అశోక్, వెంకట్రామయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.



ఏలూరు మినీ మహానాడుకు హాజరైన నాయకులు, కార్యకర్తలు



మోకాళ్లపై కూర్చుని కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

అభివృద్ధే లక్ష్యం

ఏలూరు, ద్వారకాతిరుమలలో ఘనంగా మినీ మహానాడు - భారీగా హాజరైన టీడీపీ కేడర్

ఏలూరు టూటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మినీమహానాడు ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో 35వేల కోట్లు పింఛన్లు చెల్లించామన్నారు. 1వ తేదీనే పింఛన్లు, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నామన్నారు. ఒక్కో నియోజకవర్గ అభివృద్ధికి ఉపాధి నిధులు రూ.50కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధ్వానంగా తయారైన రోడ్లను బాగు చేయడానికి నూతన రోడ్లు నిర్మించి రూ.100 కోట్లు నిధులు వెచ్చించామన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి అండని, వారికి ఎల్ల వేళలా అండగా ఉంటామన్నారు. మిగిలి ఉన్న పార్టీ పదవులు భర్తీ చేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. రూ.15కోట్లతో శనివారపుపేట కాజ్వేబ్రిడ్జిని నిర్మిస్తున్నామన్నారు. జూట్‌మిల్లు వద్ద వంతెనకు రూ.5కోట్లు కేటాయించామన్నారు. నగరపాలక సంస్థ నిధులు రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏఎంసీ ఛైర్మన్ ఎం.పార్థ సారధి, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివ ప్రసాద్, కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్.పెదబాబు, చోడే వెంకట రత్నం, జాలా సుమతి బాలాజీ, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే మద్దిపాటి ఆధ్వర్యంలో...

ద్వారకాతిరుమల : అధికారం ఉన్నది ఆధిపత్యం చెలాయించడానికి కాదని, అభివృద్ధికి వినియోగించడానికని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్పష్టం చేశారు. గోపాలపురం నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం ద్వారకాతిరుమలలోని వి.కన్వెన్షన్ హాల్లో మంగళవారం అట్టహాసంగా జరిగింది. ముందుగా నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలు తిమ్మాపురం పార్టీ కార్యాలయం నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా మినీ మహానాడు ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే వెంకట్రాజు ముఖ్య అతిథిగా హాజరుకాగా పలువురు వక్తలు 43 ఏళ్ల పార్టీ ఘన చరిత్రను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే ముందుగా స్టేజీపై నుంచి కార్యకర్తలకు మోకాళ్లపై కూర్చుని నమస్కారం చేసి సభను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు విశేష కృషి చేశారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఇలా అన్ని వర్గాలకు పసుపు జెండా అండగా నిలిచిందన్నారు. కొన్నాళ్లు ఒక నియంత పరిపాలనను చవిచూశామని, గత ప్రభుత్వ పాలన రాక్షస పాలనను గుర్తు చేసిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిలో పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తుంటే, లోకేశ్ పార్టీ నేతల్లో కార్యకర్తల్లో చైతన్యాన్ని నింపుతున్నారన్నారు. ఈ నెల 29 నుంచి కడపలో జరిగే మహానాడుకు నియోజకవర్గం నుంచి టీడీపీ శేణులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పోలిన శ్రీనివాసరావు, లంకా సత్యనారాయణ, పాకలపాటి గాంధీ, నాదెండ్ల సురేంద్రనాథ్ చౌదరి, మద్రాస్ రాము, జడ్పీటీసీ శామ్యూల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు సీహెచ్‌వోల వినతి

ఏలూరు రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): సీహెచ్‌వోలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె 23వ రోజుకు చేరింది.దీనిలో భాగంగా మంగళవారం ఉదయం కలెక్టరేట్ వద్ద ధర్నా కొనసాగించారు. జడ్పీ అతిథి గృహానికి వచ్చిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటిని సీహెచ్‌వోల సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సిద్ధయ్య మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని ఎంహెచ్ఎం కింద సీహెచ్‌వోలుగా పనిచేస్తున్న గత రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఆరేళ్లు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని, ఎన్‌హెచ్ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని ప్రతి ఏటా 5శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు స్థానచలనం

(5వ పేజీ తరువాయి)

చేసుకోవచ్చని విద్యాశాఖ ప్రకటించింది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపల్ యాజమాన్యాల పరిధిలో గ్రేడ్-2 హెచ్ఎంల బదిలీకి ఆమోదం తెలిపారు. ఏపీ వైద్య విధాన పరిషత్‌లో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వార్డు, సచివాలయ సిబ్బందిని మార్పు, చేర్పులు చేసేందుకు ఇప్పుడు అవకాశం లేదు. పోలీస్‌శాఖలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఇటీవల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో పనిచేసే వారిని రూరల్ ప్రాంతాలకు, అక్కడ పనిచేసిన వారిని పట్టణ ప్రాంతాలకు బదిలీ చేశారు.

మంత్రులు, ఎమ్మెల్యే చుట్టూ..

సాధారణ బదిలీల్లో కావాల్సిన స్థానాలకు వెళ్లడానికి వీలుగా కొందరు సిఫార్సులతో ప్రయత్నిస్తున్నారు. సాధారణ బదిలీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియకే ప్రాధాన్యం. అయినప్పటికీ ఆయా నియోజకవర్గాల్లో సామాజిక వర్గాల వారీగా కొందరు ఎమ్మెల్యే సిఫార్సుల కోసం ప్రయత్నాలు ఆరంభించారు. వారంతా ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి ఆశీస్సుల కోసం మరికొందరు ప్రయత్నిస్తున్నారు.

కుమార్తె ఇంటికి వెళ్లొచ్చేసరికి చోరీ

ఏలూరు క్రైం : స్థానిక రామకృష్ణాపురంలో వీరంకి వెంకటలక్ష్మి అనే మహిళ తన కుమార్తె ఇంటికి వెళ్లి మరుసటి రోజు మధ్యాహ్నం తిరిగి వచ్చే సరికే దొంగలు ఆ ఇంటిని దోచేశారు. ఇంట్లో టేబుల్‌పై పెట్టిన రూ.25 వేల నగదు, అరకాసు బంగారపు ఆభరణాలు ఈ నెల 17న అపహరణకు గురయ్యాయి. ఈ ఘటనపై మంగళవారం ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో సీఐ వి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించండి

బుట్టాయగూడెం, మే20(ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో జీవో 3ను పునరుద్ధరించాలని, ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక డీఎస్సీని విడుదల చేయాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అలివేరు, లంకపాకల గ్రామాల్లో కొండరెడ్లు నిరసనలు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యుడు కారం రాఘవ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో 3ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, నేటికి అమలు కాలేదని ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బన్నె వినోద్, సర్పంచ్ కారం లక్ష్మి, చింతల కృష్ణ, గోగుల పండు, చింతల మహేష్, గోగుల పద్మ, చింతల చెల్లమ్మ పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న కూటమి నేతలు

పోలవరంలో తిరంగా ర్యాలీ

పోలవరం, మే 20(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంగళవారం ఉదయం టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో కూటమి నేతలు ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పోలవరం పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల్లో మువ్వన్నెల జెండాలతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా అమరుడైన జవాన్ మురళీ నాయక్‌కి సంతాపం తెలిపి కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో కూటమి నేతలు బొడ్డు కృష్ణ, బొరగం వెంకటలక్ష్మి, దత్తి దేవి, గునపర్తి చిన్ని పాల్గొన్నారు.

రేపు అభయాంజనేయ స్వామి జయంతి

పోలవరం, మే 20(ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టు కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 22న హనుమద్ జయంతి, ఆలయ 16వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ సంరక్షకులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి తమలపాకులు, గంధసిందూరార్చనలు ప్రత్యేక పూజలు, అన్నదాన ఉంటుందన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు

జంగారెడ్డిగూడెం, మే 20(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సమయాల్లో గురువారం నుంచి జూన్ ఒకటి వరకు మార్పులు చేసినట్టు విద్యుత్ శాఖ డీఈఈ పీర్ అహ్మద్ ఖాన్ మంగళవారం తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి వెళ్తున్న ట్రాన్స్‌కో టవర్ లైన్ మార్పు చేస్తున్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వ్యవసాయ విద్యుత్‌ను ఏ-గ్రూపులో ఉదయం రెండు గంటల నుంచి పదకొండు గంటల వరకు, బి-గ్రూపులో ఉదయం పదకొండు నుంచి రాత్రి ఏడు గంటల వరకు, రాత్రి పది గంటల నుంచి పన్నెండు గంటల వరకు విద్యుత్‌ను సరఫరా చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు, మే 20(ఆంధ్రజ్యోతి) : పూళ్ల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.అంబేడ్కర్ తెలిపారు. పూళ్ళ, ఎం.ఎం.పురం ఫీడర్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

తండ్రీకొడుకుల మధ్య ఘర్షణ

పెదవేగి, మే 20(ఆంధ్రజ్యోతి) : ఆస్తి పంచివ్వాలంటూ కుమారుడు తండ్రిపై దాడికి దిగిన సంఘటన పెదవేగి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. వంగూరుకు చెందిన మిరియాల గంగరాజు ఏలూరులో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. గంగరాజు, అతని భార్యతో కలిసి వంగూరులోని సొంతింటిలో ఉంటున్నారు. కుమారుడు దినేష్ కొంతకాలం కిందట ప్రేమ వివాహం చేసుకోవడంతో వీరి మధ్య విభేదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆస్థిని పంచివ్వాలంటూ దినేష్ కొంతకాలంగా తండ్రిని వేధిస్తున్నాడు. మంగళవారం ఉదయం గంగరాజు, దినేష్‌ల మధ్య ఘర్షణలో గంగరాజు, అతని భార్యకు గాయాలవడంతో స్థానికులు వారిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై ఇరువురు ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

102 ఉద్యోగుల ఆందోళన

ఏలూరు రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి) : తల్లి, బిడ్డ ఎక్స్ ప్రెస్ 102 ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలని, కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ఏలూరులో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎస్పీడీ ప్రసాద్‌లు మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బారావు, పోసిబాబు, వెంకటేశ్, శామ్యూల్, ప్రేమకుమార్, సాయి, నరేశ్, వంశీ పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యనభ్యసించాలి

పెదవేగి, మే 20(ఆంధ్రజ్యోతి) : ఆటపాటలతో కూడిన విద్య విద్యార్థి ఉన్నతికి మరింతగా దోహదపడుతుందని పెదవేగి శాఖా గ్రంథాలయం గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ అన్నారు. పెదవేగిలోని శాఖాగ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ఆటపాటలతో కూడిన శిక్షణ ఇచ్చారు.

అలసత్వం వహిస్తే సహించేదిలేదు

ఏలూరు టూటౌన్, మే20 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని శానిటేషన్ సిబ్బందిని నగర కమిషనర్ భానుప్రతాప్ హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రతాప్ మాట్లాడుతూ నగరంలో 50 డివిజన్స్‌లో డ్రైన్లలో పూడికతీయడం, చెత్తను శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లటం చేయాలన్నారు. నగరాన్ని శుభ్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.

ఉర్దూ స్కూలు గ్రేడ్‌ను తగ్గించొద్దంటూ ఎమ్మెల్యేకు వినతి



చింతమనేనికి విన్నవిస్తున్న ముస్లింలు

ఏలూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏలూరు రూరల్ మండలంలోని శనివారపుపేట ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను డీగ్రేడ్ చేసి బేసిక్ ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్కూలు పేరెంట్స్ కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, డీఈవో వెంకటలక్ష్మమ్మలను వేర్వేరుగా కలుసుకుని వినతిపత్రాలను అందజేశారు. గత రెండున్నర దశాబ్దాలుగా ఇక్కడి పాఠశాల యూపీ పాఠశాలగా కొనసాగుతోందని, ఇప్పుడు పాఠశాల స్థాయిని తగ్గించడం వల్ల వందలాది మంది ముస్లిం మైనార్టీ బాలబాలికలు చదువుకు దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. స్కూలును డీగ్రేడ్ చేయడం వల్ల ఆరోతరగతి చదువుతున్న విద్యార్థులు ఉర్దూ మాధ్యమం కోసం 5 కిలోమీటర్ల దూరంలోని మౌలానా అబుల్ కలాం అజాద్ (మాకా) మున్సిపల్ హైస్కూలుకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. సమస్యపై డీఈవో వెంకట లక్ష్మమ్మ వివరణనిస్తూ ఎంఈవో నుంచి నివేదికను కోరాం. సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు.

మరో మత్స్యకార సంఘం వద్దంటూ ఆందోళన



వినతిపత్రం ఇస్తున్న సంఘ సభ్యులు

టి.నర్సాపురం, మే20(ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెంలో తమకు తెలియకుండా మరో మత్స్యకార సంఘం ఏర్పాటు చేయవద్దంటూ మత్స్యకార సంఘం సభ్యులు సచివాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గత 30 ఏళ్లగా 30మంది సభ్యులతో సంఘం కొనసాగుతుందని తెలిపారు. కొందరూ సంఘంలో చీలిక తీసుకురావాలని, పంచాయతీలో ఉన్న 14మంది వార్డు సభ్యుల్లో 9మంది సభ్యులకు విషయం తెలపకుండా తప్పుడు తీర్మానాలు పొంది కొత్తగా మత్స్యకార సంఘం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. మరో మత్స్యకార సంఘం ఏర్పాటుకు తీర్మానం ఎలా చేశారంటూ పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావును వివరణ కోరగా దానిని రద్దు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా పంచాయతీల విస్తార్ధాధికారి శ్రీనివాస్‌కు మత్స్యకార సంఘ నాయకులు, సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బత్తుల రమేశ్, గుండె చినచిట్టియ్య, రాంబాబు, వెంకటేశ్, శ్రీను పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

పెద్దావులు

[illegible]

పి.వేణుగోపాల చౌదరి, అడ్వకేట్, ద్వారకాతిరుమల, 9346960767

22న విజయవాడలో రెవెన్యూ సంఘం అత్యవసర భేటీ

ఏలూరు రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి) : రేషనలైజేషన్ పేరుతో జరుగుతున్న క్లస్టర్ విధానంపై ఈ నెల 22న విజయవాడలో అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం తెలిపింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక సచివాలయానికి వీఆర్వో, మరో సచివాలయానికి సర్వేయర్‌ను కేటాయిస్తూ జీవో విడుదల చేయడంపై అభ్యంతరం తెలిపారు. ఈ విధానం వల్ల జరిగే అనర్థాలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ క్లస్టర్ విధానం వల్ల సుమారు 7500 మంది వీఆర్వోలను వారు పనిచేస్తున్న సచివాలయంలో చూపించకుండా మిగులు సిబ్బందిగా చూపించడం సరికాదన్నారు. ఈ క్రమంలో తమ సంఘం కార్యాచరణను సిద్ధం చేయడానికి విజయవాడ ప్రెస్ క్లబ్‌లో మధ్యాహ్నం 2గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నాయకులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

అనర్థాలపై తహసీల్దార్‌కు వినతి

గణపవరం : మండల వీఆర్వో సంఘ అధ్యక్షుడు నిడమర్తి కేశవమూర్తి ఆధ్వర్యంలో గణపవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ అప్పారావుకు వీఆర్వోలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు చంద్రశేఖర్, రామారావు, వేణుగోపాల్, కెనడి, రామకృష్ణప్రసాద్ ఉన్నారు.



శ్రీవారి హుండీ లెక్కింపు

ఏలూరు కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని స్థానిక రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీలను 58 రోజులకుగాను మంగళవారం లెక్కించారు. ఈ మేరకు 6 లక్షల 10 వేల 704 రూపాయలు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్ తెలిపారు.

బెల్లం సప్లయ్ వ్యాపారులపై కేసు

ముసునూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): సారా తాయారీకి వినియోగించే బెల్లాన్ని సప్లయ్ చేస్తున్న ఇద్దరు వ్యాపారులపై ఎక్సైజ్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని లోపూడికి చెందిన జల్లు హరిరామకృష్ణ, పుల్లారావు కొంత కాలంగా సారా తాయారీదారులకు బెల్లం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దుకాణంపై దాడి చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి, కోర్టులో హజరుపర్చాగా జడ్జి వీరికి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. ఎక్సైజ్ నేరాలపై 9440902462 నంబరుకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

కోర్టుకు హాజరైన ముద్దరబోయిన

నూజివీడు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మంగళవారం నూజివీ డు కోర్టుకు హాజరయ్యారు. గత ఎన్నికల సమయంలో బాపులపాడు మండలంలో ఎన్నికల ప్రచారంలో ఉండగా, ధర్నా నిర్వహించారు. ధర్నా విషయంలో హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసునమోదు చేయగా, సంబంధిత కేసు విషయమై ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నూజివీడు కోర్టుకు హాజరయ్యారు.

నూజివీడుకు బయోగ్యాస్ ప్లాంట్

నూజివీడు, మే 20 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గానికి పరిశ్రమలు సాధించి, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తానని నూజివీడు శాసనసభ్యుడు కొలుసు పార్థసారథి ఇచ్చిన హామీ కార్యరూపం దాలుస్తోంది. రాష్ట్రమంత్రివర్గం నేడు తీసుకున్న నిర్ణయాల్లో ఏలూరుజిల్లా నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లి వద్ద నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ కంపెనీవారు 20 టీపీడీ కంప్రెస్‌డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయటానికి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇంధనశాఖ ఈ ప్రతిపాదనను ఆమోదిస్తూ రాష్ట్రమంత్రి మండలి ఆమోదం కోసం పంపింది. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ ప్రతిపాదన ఆమోదిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టను రూ.150 కోట్ల పెట్టుబడితో పెట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కానుంది. దీని ద్వారా నూజివీడు నియోజకవర్గం పారిశ్రామికంగా ఒక అడుగు ముందుకు వేసిన ట్లేనని భావి స్తున్నారు. కంప్రెస్‌డ్ బయోగ్యాస్ అనేది పర్యావరణ అనుకూల మైన పునరుత్పాదక ఇంధనం. ఇది సేంద్రియ వ్యర్థాల నుంచి ఉత్పత్తి అవుతుంది. ఆటోమోటివ్, పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతాల్లో సీబీజీ ఉత్పత్తి చేయబడిన బయోగ్యాస్‌ను శుద్ధిచేసి హైడ్రోజన్ సల్ఫైడ్, కార్బన్‌డైఆక్సైడ్, నీటిఆవిరిని తొలగించటం ద్వారా చేయబడుతుంది. శుద్ధిచేసిన ఈ బయోగ్యాస్‌లో 90 శాతం కంటే ఎక్కువ మిథేన్ ఉంటుంది. సీబీజీ ఉత్పత్తి, వ్యవసాయ వ్యర్థాలు, మున్సిపల్ వ్యర్థాలు, ఆహార వ్యర్థాల ద్వారా ఇది ఉత్పత్తి జరుగు తుంది. ఇది సీఎన్‌జీకి ఒక ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగపడు తుంది. అంతేకాదు సీబీజీ గృహాల కోసం కూడా ఉపయోగించవచ్చు. విద్యుత్ ఉత్పత్తికి కూడా ఇది ఉపయోగపడుతుంది.


బయోగ్యాస్ ప్లాంట్ నమూనా

ఏలూరులో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ !

మంత్రివర్గ సమావేశంలో గ్రీన్‌సిగ్నల్
దూరవిద్య యూజీ, పీజీ కోర్సులతో
అన్నివర్గాలకు విస్తృత విద్యాప్రయోజనాలు

ఏలూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఉన్నతవిద్యలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరున్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏలూరులో ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉమ్మడి రాష్ట్రం విభజన కాలపరిమితి గతేడాది ముగియడంతో ఏడాది కాలంగా (2023-24) నిలిచిపోయిన యూనివర్సిటీ ప్రవేశాలను, కార్య కలాపాలను ఇకమీదట ఆంధ్రప్రదేశ్ నుంచే ఏలూరు ప్రధానకేంద్రంగా మళ్లీ ప్రారంభించ డానికి మార్గం సుగమమైంది. గతేడాదివరకు ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించి హైదరాబాద్ కేంద్రంగా విశ్వవిద్యాలయం కార్యకలాపాలు జరిగాయి. రాష్ట్ర విభజన అనంతరం పదేళ్ల కాలపరిమితి గతేడాది ముగి యడంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం అడ్మిషన్లను నిలిపివేసింది. దీంతో రాష్ట్ర విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రాష్ట్రానికి సంబంధించి అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ప్రధాన కేంద్రాన్ని ఏలూరులోనే నెలకొల్పడం ద్వారా దూరవిద్యా విధానంలో యూజీ, పీజీ కోర్సులు చేయాలనుకునే అభ్యర్థులకు విస్తృత విద్యాప్రయోజ నాలతో వెసులుబాటు కల్పించింది.

ఏలూరులో యూనివర్సిటీ ఎక్కడ..?

1984లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్‌ను ఏలూరు సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ప్రాంగణంలోని ఓ భవనంలో ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీకి వున్న 70 స్టడీసెంటర్లలో ఏటా కొత్తగా 30 వేల అడ్మిషన్లు జరుగుతుండగా, ఆయా కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు, బ్యాక్‌లాగ్ విద్యార్థులు కలిపి మొత్తంమీద లక్షమంది ఉంటారని అంచనా. జిల్లాకు సంబంధించి ఏలూరు, భీమ వరం, తణుకు, నల్లజర్ల, చింతలపూ డిలలో యూనివర్సిటీ సెంటర్లు ప్రస్తుతం కొనసాగు తున్నాయి. కాగా మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయంతో ఏలూరు కొత్తగా ఏర్పాటవుతోన్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎక్కడ ఉంటుందనే ఊహా గానాలు జోరందుకున్నాయి. యూనివర్సిటీకి కొత్తగా భవనాలు నిర్మించడానికి అవసరమైన భూముల గుర్తింపు, సేకరణ, నిధుల విడుదల, తదితర మౌలిక వనరులు కల్పించేలోగా కొంతకాలం పాటు అందు బాటులో వున్న భవనాల్లో కార్యకలాపాలను ప్రారం భించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ప్రతిష్టాత్మక ఏపీ నిట్ తొలుత ఏలూరుకు మంజూరు కాగా, నగర శివార్లలోని వట్లూరు చెరువు భూములను నిట్ భవన నిర్మాణాల కోసం కేటాయించడం, ఆ మేరకు నిర్మాణాలు పూర్తయ్యేలోగా స్థానికంగా అన్ని వసతులున్న సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల భవనాల్లో తరగతు లను ప్రారంభించడానికి అప్పట్లో సన్నాహాలు జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలోనే తాజాగా ఏలూ రుకు మంజూరైన అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయానికి నూతన భవనాల నిర్మాణం జరిగేలోగా యూనివర్సిటీ అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ కార్యకలా పాలను స్థానికంగా అన్ని సౌకర్యాలున్న ఏదైనా విద్యా సంస్థకు చెందిన భవనాల్లో తాత్కాలిక ప్రాతిపదికన ప్రారంభించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. సాధార ణంగా ఏటా జూన్ నుంచి మరుసటేడాది ఏప్రిల్ వరకు అంబేడ్కర్ యూనివర్సిటీ ఆఫర్ చేసే కోర్సులకు విద్యాసంవత్సరంగా ఉంటోంది. జూన్ నుంచి ప్రారంభమయ్యే నూతన విద్యాసంవత్సరంలోనే యూని వర్సిటీ అకడమిక్ కార్యకలాపాలను పునరుద్ధరిస్తారని భావిస్తున్నారు. ఆ ప్రకారం ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల కోసం కొత్తగా ఏర్పాటవుతోన్న అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కోసం ఒక ఉపకులపతి, రిజిస్ట్రార్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, బోధనకు ఫ్యాకల్టీ, పరిపాలనా విభాగం, బోధనేతర సిబ్బంది నియామకాలు జరగాల్సి ఉంది. ఈలోగా కార్యకలాపాలను ఎక్కడ నిర్వహి స్తారన్న విషయంపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.


ఏలూరులోని అంబేడ్కర్ స్టడీ సెంటర్

అతి తక్కువ ఫీజులతో ఉన్నత విద్యావకాశాలు

1982లో స్థాపించిన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సి టీలో దూరవిద్యా విధానంలో వివిధ డిగ్రీ, పీజీ, డిప్లొమా, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు, మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటు, ఏ యూని వర్సిటీలోను లేనివిధంగా బీఈడీ కోర్సును దూరవిద్యా విధానంలో చదివేందుకు అవకాశం ఉంది. జాతీయ స్థాయి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (డెక్) అనుమతి ఉండటంతో యూనివర్సిటీ జారీచేసే సర్టిఫికెట్లతో ప్రభుత్వోద్యోగాలు కూడా పొందవచ్చు. ముఖ్యంగా ఇంటర్ ఉత్తీర్ణతతో ప్రభుత్వోద్యోగాలు చేస్తున్నవారు పదోన్న తులు పొంద డానికి అవసరమైన డిగ్రీ, పీజీ కోర్సులను అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పూర్తిచేయడానికి అనువుగా ఉంటోంది. గృహిణులు, వ్యాపారులు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు, పేదవర్గాలకు చెందినవారికి తక్కువ ఫీజుల్లోనే ఉన్నతవిద్యను అభ్యసించ డానికి యూనివర్సిటీ ప్రత్యేకతగా చెప్పవచ్చు. రెగ్యులర్ తరగతులకు అవసరమైన హాజరుతో నిమిత్తం లేకుండా వారాంతపు రోజులు, పండుగల్లో కాంటాక్టు క్లాసులను నిర్వహిస్తుండటం వల్ల అడ్మిషన్లు తీసుకున్నవారికి అనువుగా ఉంటోంది. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తిచేయడానికి సుమారు రూ.3,200, పీజీ విద్యకు సుమారు రూ.5 వేలు కోర్సు మెటీరియల్‌తో సహా ఏడాది కాలానికి ఉంటోంది. ఈ వెసులుబాటును ఉపయోగించుకుని యూనివర్సిటీలో చదివిన పలువురు అభ్యర్థులు ఐఏఎస్, తదితర ఆలిండియా సర్వీసులు కూడా చదివిన వారుండటం గమనార్హం.

ఉద్యోగులకు స్థానచలనం

(5వ పేజీ తరువాయి)

చేసుకోవచ్చని విద్యాశాఖ ప్రకటించింది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపల్ యాజమాన్యాల పరిధిలో గ్రేడ్-2 హెచ్ఎంల బదిలీకి ఆమోదం తెలిపారు. ఏపీ వైద్య విధాన పరిషత్‌లో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వార్డు, సచివాలయ సిబ్బందిని మార్పు, చేర్పులు చేసేందుకు ఇప్పుడు అవకాశం లేదు. పోలీస్‌శాఖలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఇటీవల బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో పనిచేసే వారిని రూరల్ ప్రాంతాలకు, అక్కడ పనిచేసిన వారిని పట్టణ ప్రాంతాలకు బదిలీ చేశారు.

మంత్రులు, ఎమ్మెల్యే చుట్టూ..

సాధారణ బదిలీల్లో కావాల్సిన స్థానాలకు వెళ్లడానికి వీలుగా కొందరు సిఫార్సులతో ప్రయత్నిస్తున్నారు. సాధారణ బదిలీల్లో కౌన్సెలింగ్ ప్రక్రియకే ప్రాధాన్యం. అయినప్పటికీ ఆయా నియోజకవర్గాల్లో సామాజిక వర్గాల వారీగా కొందరు ఎమ్మెల్యే సిఫార్సుల కోసం ప్రయత్నాలు ఆరంభించారు. వారంతా ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి ఆశీస్సుల కోసం మరికొందరు ప్రయత్నిస్తున్నారు.

ట్రిపుల్ ఐటీకి 48,988 దరఖాస్తులు

నూజివీడు టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్‌అండ్ టెక్నాలజీ పరిధిలో గల ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసే సమయానికి 48,988 విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను దాఖలు చేసినట్లు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సండ్రా అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలో నూజివీడు, ఆర్కేవ్యాలీ (ఇడుపులపాయ), ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు సంబంధించి 4వేల సాధారణ సీట్లతో పాటు మరో 400 సూపర్ న్యూమనరీ సీట్లకు మంగళవారంతో దరఖాస్తుల గడువు ముగుస్తోంది. సాధారణంగా సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు గడువును ఇవ్వగా, 48,988 దరఖాస్తులు దాఖలు అయ్యాయని, అయితే అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తు గడువును యూనివర్శిటీ పొడిగించినట్లు ఆయన తెలిపారు.

ఆటలతోనే శరీర దారుఢ్యం


కుర్చీలాట ఆడుతున్న విద్యార్థులు

ముదినేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయా ధికారిణి ఎం.శ్రీదేవి విద్యార్థులకు లెమన్ స్పూన్, కుర్చీలాట పోటీలు నిర్వహించిన అనంతరం ఆటల వల్ల కలిగే ప్రయోజ నాలను వివరించారు. విద్యార్థి దశలోనే క్రీడల పట్ల ఉత్సాహం, ఆసక్తి చూపాల్సిన అవసరం ఉందని, చిన్న వయస్సు నుంచే శరీర దారుఢ్యం పెరుగుతుందని ఆమె తెలిపారు.

నీటి తీరువా బకాయిలు చెల్లించాలి

చాట్రాయి, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు నీటితీరువా బకాయిలను వీలైనంత త్వరగా చెల్లించాలని తహసీల్దార్ ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి రైతుల నుంచి నీటి తీరువా వసూలు చెయ్యకపోవటంతో రూ.40 లక్షలు బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. బకాయిలకు సంబంధించిన డిమాండ్స్ ఆయా సచివాలయాలకు వచ్చాయని, రైతులు సచివాలయాలకు వెళ్ళి నీటి తీరువా బకాయిలు చెల్లించి, నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రెండు ఎక్స్‌కవేటర్లు స్వాధీనం



చాట్రాయి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ పెద్ద చెరువులో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న రెండు ఎక్స్‌కవేటర్లను మంగళవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు స్వాధీ నం చేసుకొని కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం రావటంతో రెవెన్యూ పోలీస్ సిబ్బంది అక్కడకు వెళ్ళేసరికి ట్రాక్టర్లు వెళ్ళిపోవటంతో, అక్కడ ఉన్న ఎక్స్‌కవేటర్లను స్వాధీనం చేసుకున్నారు.

ఉప్పుటేరులో అక్రమంగా చేపల గూళ్లు


ఉప్పుటేరులో ఏర్పాటు చేసిన చేపల గూళ్లు

నీటి ప్రవాహానికి అడ్డంకి.. గుళ్లు చుట్టూ పేరుకుపోతున్న చెత్త, తూడు

కలిదిండి, మే 20 (ఆంధ్రజ్యోతి): చేపల వేట నిషేధం అమలులో ఉన్నప్పటికీ ఉప్పుటేరులో చేపల గూళ్లు యథేచ్ఛగా ఏర్పాటు చేస్తున్నారు. మద్వానిగూడెం వంతెన వద్ద నుంచి పెదలంక వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర ఉప్పుటేరులో ముళ్ల కంచెలు చింత చెట్టు కొమ్మలతో గూళ్ల ఏర్పాటు చేశారు. గూళ్లలోకి చేరుకున్న చేపలను వలలతో వేటాడుతుంటారు. చేపల గూళ్లతో ఉప్పుటేరులో నీరు రాకపోకలకు అంతరాయం కలగటంతోపాటు పూడుకుపోతున్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సముద్రపు నీరు ఉప్పుటేరులోకి పోటు, పాటు నీరు రాకపోకలు ఉంటాయి. కొల్లేరులో వరద నీరు ఉప్పుటేరు గుండా సముద్రంలోకి పోతుంది. సంవత్సరం పొడవునా కొంతమంది సిండికేటుగా ఏర్పడి ఉప్పుటేరులో చేపల గూళ్ల పెట్టడంతో నీటి ప్రవాహానికి అడ్డుకట్టగా నిలుస్తున్నాయి. గూళ్ల చుట్టూ డెక్క తూడు చెత్తాచెదారం మేట వేసుకుపోతున్నాయి. ఉప్పుటేరులో చేపల గూళ్ల ఏర్పాటు చేయటం నిషేధమని వాటిని తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం చేపలు గుడ్లు పెడుతుంటాయని, వాటి పిల్లలను ఉత్పత్తి చేసుకునే దశలో చేపల గూళ్ల పెట్టి చేపలను వేటాడుతున్నప్పటికీ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఉప్పుటేరులో ఉన్న చేపల గూళ్లను తొలగించటానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




జలమయమైన ముదినేపల్లి - గుడ్లవల్లేరు ఆర్ అండ్ బి ప్రధాన రహదారి.. పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షపు నీరు.. మండవల్లిలో జాతీయ రహదారిపై నిలిచిన నీరు

కుండపోత

వర్షానికి రహదారులు జలమయం

మండవల్లి మే 20(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలంలో మంగళవారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండవల్లిలో తెల్లవారుజామున 4.30గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు వర్షం కురవగా, 7.24సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండవల్లిలోని జాతీయ రహదారి, ఆసుపత్రి ఆవరణ, పల్లపు బజారు, బీసీ, ఎస్సీ కాలనీలు, పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎండ వేడి, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందుతున్నారు. అకాల వర్షంతో ఆక్వారైతులు ఆందోళన చెందుతున్నారు.

ముదినేపల్లి: భారీ వర్షం గ్రామీణ ప్రాంతాలను అతలాకుతలం చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి కుండపోతగా కురిసిన వర్షం ముదినేపల్లి మండలంలోని పలు ప్రధాన రహదారులను ముంచెత్తటంతోపాటు కొన్ని చోట్ల ఇళ్ల పరిసరాలను జలమయం చేసింది. మంగళవారం ఉదయం 8 గంటలకు ముదినేపల్లి మండలంలో 80.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఏలూరు జిల్లాలో నమోదైన వర్షపాతంలో ఈ మండలం రెండవ స్థానంలో ఉంది. ఎడతెరపి లేకుండా మంగళవారం ఉదయం 11 గంటల వరకు కురిసిన వర్షం కారణంగా ముదినేపల్లిలోని జాతీయ రహదారితోపాటు, గుడ్లవల్లేరు రహదారిపై పెద్ద ఎత్తున నీరు నిలిచింది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్లలోకి వర్షపు నీరు వెళ్లే అవకాశం లేక రోడ్లు కాల్వ లాగా కనిపిస్తున్నది. ముదినేపల్లి - గుడ్లవల్లేరు రూటులో గురజ వరకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీలో రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఉండటమే కాక, పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు ప్రవేశించింది. కాలనీ నుంచి నీరు బయటకు పోయే మార్గం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం వల్ల మండలంలో పలు చోట్ల ఉపాధి పనులు నిర్వహించే అవకాశం లేకుండాపోయింది.


కైకలూరు మినీ మహానాడుకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ఆక్వాకు రాయితీలు కల్పించాలి

కైకలూరు టీడీపీ మినీ మహానాడు

కైకలూరు, మే 20(ఆంధ్రజ్యోతి): ఆక్వారంగాన్ని సంక్షోభం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు రాయితీలు కల్పించాలని, కొల్లేరుకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని మినీమహానాడులో తీర్మానం చేశారు. మంగళవారం కైకలూరు సీతారామఫంక్షన్ హాలులో నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అధ్యక్షతన టీడీపీ మినీమహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం పనిచేసిన ప్రజలందరికీ రుణపడి ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో ప్రజలంతా స్వేచ్ఛగా జీవిస్తున్నారని, గత ప్రభుత్వం తరహాలో భయపెట్టడాలు, అక్రమ కేసులు లేవని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీ జెండాను ఆవిష్కరించి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇటీవల కైకలూరు వైస్ఎంపీపీగా ఎంపికైన తామరకొల్లు ఎంపీటీసీ సభ్యురాలు గంగుల వెంకట నరసమ్మను సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్రపార్టీ కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్, రాష్ట్రకార్పొరేషన్ డైరెక్టర్లు కొడాలి వినోద్, పీజెఎస్ మాల్యాద్రి, అంద్రాజు శ్రీను, లంకా రత్నారావు, కోకన్వీనర్లు బొమ్మనబోయిన విజయలక్ష్మీ, బలే ఏసురాజు, మండలపార్టీల అధ్యక్షులు త్రినాధరాజు, పోకల జోగిరాజు, చల్లగుళ్ళ శోభనాద్రిచౌదరి పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో రమణక్కపేట విద్యార్థినుల ప్రతిభ

ముసునూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్స్ విభాగంలో కృష్ణాజిల్లా జట్టు తృతీయ స్థానం సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్, కోచ్ వాకా నాగరాజు తెలిపారు. చిత్తూరులో జరిగిన ఈ పోటీల్లో రమణక్క పేట జడ్పీపాఠశాలకు చెందిన నలుగురు బాలికలు అత్యంత ప్రతిభ కనబర్చి జట్టుకు విజయాన్ని అందించారని ఆయన చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జట్టుపై ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు 16-13 స్కోర్‌తో విజయం సాధించి, మూడవ స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. బాలికలను పాఠశాల హెచ్ఎం రామకృష్ణ అభినందించారు.

సైబర్ నేరగాళ్ల మరో మోసం

క్రెడిట్ కార్డు నుంచి రూ.లక్షా 27,264 సొమ్ము మాయం

ముదినేపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి) : క్రెడిట్‌కార్డు నుంచి గప్‌చిప్‌గా సైబర్ నేరగాళ్లు సొమ్మును మాయం చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ముదినేపల్లికి చెందిన రేమల్లి రవికుమార్ అనే లారీ డ్రైవర్ స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో క్రెడిట్ కార్డు కలిగి ఉన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో లక్షా 8 వేల రూపాయలు ఆ క్రెడిట్ కార్డుపై వినియోగించుకుని కొద్ది రోజుల్లోనే తిరిగి కట్టేశాడు. అదే నెల 28న స్టేట్ బ్యాంక్ ఎంబ్లమ్‌తో కలిగిన ఒక నెంబర్ నుంచి రవికుమార్‌కు ఫోన్ కాల్ వచ్చింది. మేము ఎస్‌బీఐ నుంచి ఫోన్ చేస్తున్నాము మీరు క్రెడిట్ కార్డును వాడుకుంటారా? బ్లాక్ చేయమంటారా అని ఫోన్‌లో నేరగాళ్ళు అడుగగా అప్పటికే క్రెడిట్ కార్డు వినియోగాన్ని నిలిపివేద్దామన్న ఆలోచనలో ఉన్న రవికుమార్ కార్డును బ్లాక్ చేయమని చెప్పాడు. అయితే మీనెంబర్‌కు వచ్చిన ఓటీపీని చెప్పమని నేరగాళ్ళు అడుగగా తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్‌ను రవికుమార్ తెలిపాడు. వెంటనే అతని క్రెడిట్ కార్డు నుంచి రూ.లక్షా 27,264 మాయమయ్యాయి. ఒకేరోజు కాస్ స్పోర్ట్జా టెక్నాలజీస్ పేరున నాలుగు విడతలుగా లక్ష రూపాయలు, పేటీఎం ఫ్లిప్‌కార్డు ఇంటర్‌నెట్, నోయిడా పేరున రూ. 27 వేల 264లు క్రెడిట్ కార్డు నుంచి కట్ అయ్యాయి. సోమవారం రాత్రి ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితుడు రవికుమార్ ఫిర్యాదు చేశారు.

దేశ రక్షణకు సైనికుల పోరాటం మహోన్నతం



కైకలూరు తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): పాక్ ఉగ్రవాదులను అంతమొందించడంలో త్రివిధ దళాల బలం ప్రపంచానికి తెలిసిందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరులోని ట్రావెలర్స్‌బంగ్లా నుంచి మార్కెట్‌యార్డ్ వరకు జాతీయ రహదారి వెంబడి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వేలాది మంది ప్రజలు పాల్గొని ఆపరేషన్ సింధూర్ సైనికులకు జేజేలు కొట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పహల్గామ్‌లో హిందువు లను టార్గెట్ చేస్తూ కిరాతకంగా హతమార్చిన ఉగ్రవాదుల ఏరివేతకు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరువచ్చిందన్నారు. పాకిస్తాన్ వేసిన ఒక్క డ్రోన్‌బాంబు కూడా ప్రజలపైకి రాకుండా సరిహద్దుల్లో సైనికులు అడ్డు కుని ప్రాణనష్టాన్ని లేకుండా కాపాడా రని దేశం కోసం సైనికులు చేస్తున్న పోరాటం మహో న్నత మైనదన్నారు. తెలుగురాష్ట్రాలకు చెందిన ఇరువురు జవాన్లు వీరమరణం పొందడం బాధాకరమని, వారి కుటుంబసభ్యులు సైతం బిడ్డలను కోల్పోయినా దేశంకోసం ప్రాణాలు అర్పించినందుకు గర్వపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ కృష్ణ, కూటమి నేత లు నరసింహారావు, బొమ్మనబోయిన విజయలక్ష్మీ, బలే ఏసురాజు, పెన్మెత్స త్రినాథరాజు, శివశంకర్, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

కలిదిండి, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పరసావాని పాలెంలో అభిమానులు, టీడీపీ నాయకులు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఎన్టీఆర్ బర్త్ డే కేక్‌ను కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, అభిమానులు పేరం శివకృష్ణ, ముచ్చు జయరాజు, పడమటి అయ్యప్ప, పేరం ప్రసాద్ పాల్గొన్నారు.

కైకలూరు: సినీనటుడు ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలను అభిమానుల ఆధ్వర్యంలో కైకలూరులో ఘన ంగా జరిపారు. మంగళవారం నందమూరి యువసేన అధ్యక్షు డు వేగిరెడ్డి సురేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి, కోరుకొల్లు రోడ్డు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్ర హం వద్ద కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఎన్టీఆర్ అభిమానులు లక్కింశెట్టి మోహన్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముసునూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు జి.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మికుల సమస్యలపై ముసునూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాజు మట్లాడుతూ కార్మికుల హక్కుల కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్‌కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు.

నూజివీడు టౌన్: లేబర్‌కోడ్ చట్టాలను నిరసిస్తూ నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను తక్షణం రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475